

విదేశాలకు అంటే భయమేస్తుంది..

గతంలో నేను కొంతమందితో కలిసి ఇరాన్ వెళ్లాను. ఆ సమయంలో ఏజెంట్ మంచి కంపెనీతోపాటు భద్రత ఉంటుందని చెప్పారు. తీరా అక్కడకు తీసుకెళ్లి సరిహద్దు ప్రాంతంలో ఉన్న కంపెనీలో వేశారు. అక్కడ నిత్యం తీవ్రవాదులు, సైన్యం మధ్య ఎదురుకాల్పులు జరుగుతుంటాయి. దాదాపు మూడు నెలల పాటు ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నాం. మా బాధలు ఎవరికైనా చెబితే తేలిగ్గా తీసుకునేవారు. చివరకు కుటుంబసభ్యులకు చెప్పాం. ఎంపీ రామ్మోహన్ నాయుడు చొరవతో క్షేమంగా స్వగ్రామాలకు చేరుకోగలిగాం. విదేశాలు అంటేనే భయం కలుగుతోంది. అందుకే నేను ప్రస్తుతం మహారాష్ట్రలో ఓకంపెనీలో పని చేసుకుంటున్నాను.

- భిన్నాళ నాగభూషణరావు, తాళ్లభద్ర



- ఉద్యోగాల పేరిట మోసాలు
- గల్ఫ్‌లో నలిగిపోతున్న జిల్లావాసులు
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న శిక్షణ సంస్థలు
- విదేశాల్లో అనారోగ్యానికి గురై ప్రాణాలు కోల్పోతున్న జిల్లా యువకులు
- మృతదేహాలు స్వదేశానికి తెప్పించడంలో ఇబ్బందులు



స్థానికంగా ఉపాధి దొరక్కే..

సింగపూర్‌లోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాను. అత్యంత భద్రత నడుమ పనిచేయాల్సి ఉంటుంది. ఏమాత్రం ఏమరపాటు చూపినా ఇబ్బందులు తప్పవు. ఇండియాలో ఆశించిన స్థాయిలో ఉపాధి లేకపోవడంతో నాలాంటి వారు ఎంతోమంది ఇలా విదేశీబాట పడుతున్నాం. కుటుంబ సభ్యులను విడిచిపెట్టి కష్టం మీద వస్తున్నాం. స్థానికంగా ఉపాధి ఉంటే మాలాంటి వారికి ఇటువంటి పరిస్థితి వచ్చేది కాదు.

- కర్రి వాసుదేవరావు, తాళ్లభద్ర

విదేశీ కొలువు కష్టాలు

- జూన్ 14న కువైట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో సోంపేట మండలం జింకిభద్ర గ్రామానికి చెందిన తామాడ లోకనాథం అనే యువకుడు మృత్యువాత పడ్డాడు. సెలవులు ముగించుకొని స్వగ్రామం నుంచి కువైట్ చేరుకున్న లోకనాథం క్యాంపు భవనంలో నిద్రిస్తుండగా అగ్నిప్రమాదం జరగడంతో సజీవ దహనం అయ్యాడు. ఈ ఘటనలో ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 50 మంది భారతీయులు దుర్మరణం పాలయ్యారు. అందులో మన రాష్ట్రానికి చెందినవారు ముగ్గురు ఉన్నారు.

- ఏప్రిల్‌లో సోంపేట మండలం పొత్రఖండ గ్రామానికి చెందిన పోలేటి లోహిదాస్యుడు దుబాయ్‌లో మృతిచెందారు. కొన్నేళ్లుగా అక్కడ ఓ కంపెనీలో లోహిదాస్యుడు పనిచేస్తున్నారు. గుండెపోటు రాగా.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు దాదాపు పదిరోజులు పట్టింది.

- కొద్దిరోజుల కిందట సోంపేట, మందస మండలాలతో పాటు విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన దాదాపు 30మంది ఇరాన్‌లో చిక్కుకున్నారు. మంచి ఉద్యోగం, సరైన భద్రత ఉంటుందని ఏజెంట్ వారిని నమ్మించి ఇరాన్ తీసుకెళ్లాడు. ఆ దేశ సరిహద్దు ప్రాంతంలో ప్లాంట్ నిర్మాణంలో పనికి కుదిర్చాడు. అంతవరకు బాగానే ఉంది. అయితే ఆ సరిహద్దు ప్రాంతంలో తరచూ ఆ దేశ సైనికులకు, మిలిటెంట్లకు మధ్య యుద్ధం జరుగుతూ ఉంటుంది. నిత్యం తుపాకీ మోతతో దద్దరిల్లుతుంది. దీంతో భయం మాటున ఉపాధి కోసం మన దేశం నుంచి వెళ్లిన వారంతా కొద్దినెలల పాటు గడపాల్సి వచ్చింది. చివరకు అప్పటి ఎంపీ, నేటి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చొరవతో వారు స్వస్థలాలకు చేరుకున్నారు.

- గత ఏడాది ఫిబ్రవరి 7న తుర్కియో (టర్కీ)లో భారీ భూకంపం సంభవించింది. వందలాది మంది ప్రాణాలను కోల్పోయారు. భూకంప తీవ్రత ఉన్న అదానీ నగర శివార్లలోని ఓ పరిశ్రమ నిర్మాణంలో జిల్లాలోని పలాస, సోంపేట, కంచిలి, కవిటి, మందస మండలాలకు చెందిన యువకులు పదుల సంఖ్యలో పనిచేస్తున్నారు. ఆ సమయంలో వారు కంటైనర్లలో ఉండడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. లేకుంటే భారీ ప్రాణ నష్టం సంభవించేది.

(టెక్కలి)

విదేశీ కొలువుల కలలు.. కల్లలుగా మారుతున్నాయి. కొందరి జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. మరికొందరి ఆశలు నిలువునా ముంచేస్తున్నాయి. ఇటీవల ఇటువంటి బాధితులు ఒక్కొక్కరూ వెలుగులోకి వస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ఎడారి బతుకులను బయట ప్రపంచానికి చెబుతున్నారు. ఇటీవల మంత్రి నారా లోకేష్ స్పందించి ఇద్దరు బాధితులను క్షేమంగా స్వస్థలాలకు రప్పించారు. అయితే ఇది సిక్కోలు ప్రజలకు నిత్య అనుభవం అవుతోంది. జిల్లా నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్తున్న వారు అక్కడ మోసాలకు గురికావడం, చిక్కుకోవడం పరిపాటిగా మారింది. గత పదేళ్లుగా స్థానిక ఎంపీ, ప్రస్తుత కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అనేక సందర్భాల్లో బాధితులను కాపాడుతూనే వస్తున్నారు. ఆయన విన్నపం మేరకు కూటమి ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఐ బాధ్యతలను ఒక మంత్రికి అప్పగించింది. మంత్రి నారా లోకేష్ ఈ విషయంలో ప్రత్యేక చొరవచూపుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నిరుద్యోగ యువత ఎక్కువగా ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళుతుంటారు. భవన నిర్మాణం, పైపులైనింగ్, వెల్డింగ్, ఫిట్టింగ్ తదితర వాటితో పాటు పరిశ్రమల్లో కార్మికులుగా పనిచేస్తుంటారు. ఒక్కో గ్రామం నుంచి కనీసం 50 మంది నుంచి 200 మంది వరకూ నిరుద్యోగ యువత విదేశీ కార్మికులుగా పనిచేస్తున్నారు. ముఖ్యంగా సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి మండలాల యువకులు ఎక్కువగా ఆశ్రయిస్తుంటారు. పదో తరగతి పూర్తయిన తర్వాత వెల్డర్, ఫిట్టర్, ఫ్యాబ్రికేటర్‌గా శిక్షణ తీసుకోవడం.. తరువాత ఉపాధి బాట పట్టడం ఉద్దానంలో పరిపాటిగా మారింది. 11 మండలాల్లో సుమారు 20వేల మంది యువత విదేశాల్లో ఉపాధి పొందుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ప్రారంభంలో విదేశీ ఉద్యోగం గిట్టుబాటుగా ఉండేది. స్వదేశీ కంపెనీల్లో పనిచేసే వారిలో నైపుణ్యం చూసి.. సదరు కంపెనీలు తమకు విదేశాల్లో ఉండే పరిశ్రమలకు పంపించేవి. విమాన టిక్కెట్లతో పాటు వీసా, వసతి తదితర వాటిని సమకూర్చేవి. దీంతో విదేశాల్లో పనిచేయడం లాభసాటిగా ఉండేది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అంతటా బ్రోకర్ వ్యవస్థ నడుస్తోంది. మేన్ పవర్ ఏజెన్సీలు, శిక్షణ సంస్థల మాటున విదేశీ పరిశ్రమల్లో పనిచేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులను ఎంపిక చేసినందుకు రూ.లక్షల్లో కమీషన్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఎక్కువగా బోగస్ కంపెనీల పేరుతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఒక్కోసారి విదేశాలకు వెళ్తున్న వారికి అక్కడ కంపెనీ ప్రతినిధులు ముఖం చాటేస్తున్నారు. పరిశ్రమల్లో నిర్మాణ పనులని చెప్పి.. పారిశుధ్య పనులు, ఒంటెల కాపరి, ఇంటిపనులు చేయించిన సందర్భాలు సైతం ఉన్నాయి. ఇంటర్వ్యూలో ఒప్పందం ప్రకారం జీతాలు చెల్లించరు. సౌకర్యాలు కల్పించకపోవడంతో జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత పడే ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. సమయానికి భోజనం లేక.. కుటుంబ సభ్యులు దగ్గర లేక.. చాలా మంది ఆందోళనకు గురై.. అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ క్రమంలో కొంతమంది మానసిక ఒత్తిడితో ప్రాణాలు కోల్పోతున్నారు. అలాగే విదేశాల్లో వాతావరణ పరిస్థితులు అనుకూలించక మరికొంతమంది చనిపోతున్నారు. అక్కడ పరిశ్రమల్లో కనీస భద్రతా చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాల బారినపడి కొంతమంది ప్రాణాలు కోల్పోగా.. వారి మృతదేహాలను స్వస్థలాలకు తెప్పించడం కత్తిమీద సాములా మారుతోంది. అక్కడ నిబంధనలు అడ్డంకిగా నిలుస్తున్నాయి. దీంతో మృతదేహాల కోసం బాధిత కుటుంబ సభ్యులు రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తోంది.



గల్ఫ్ దేశాల్లో పరిశ్రమల వద్ద నిరుద్యోగ యువత పడిగాపులు (ఫైల్)



పరిశ్రమ గేటు వద్ద పనుల కోసం క్యూకట్టిన దృశ్యం

ఘోరం

- పైడిభీమవరం వద్ద రోడ్డు ప్రమాదం
- ఫ్లైఓవర్ డివైడర్‌ను ఢీకొన్న బైక్
- మహిళ, యువకుడి మృతి
- మృతులు మందస మండల వాసులు
- తుని నుంచి వస్తుండగా ఘటన



హర్యాని, జీవన్ (ఫైల్)

రణస్థలం, జూలై 30: రణస్థలం మండలం పైడిభీమవరం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మందస మండలం బొగాబంద పంచాయతీ కడుముసాయి గ్రామానికి చెందిన సవర హర్యాని(25), సవర జీవన్(20)లు సమీప బంధువులు. వరుసకు వదినా మరిది అవుతారు. వీరు బైక్‌పై కాకినాడ జిల్లా తునిలో మంగళవారం మధ్యాహ్నం బయలుదేరారు. రాత్రి 9గంటల సమయంలో పైడిభీమవరం ఫ్లైఓవర్ వద్దకు వచ్చేసరికి బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. హర్యాని అక్కడికక్కడే మృతిచెందగా.. జీవన్ ఫ్లైఓవర్ కిందకు పడి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న జాతీయ రహదారి భద్రతా సిబ్బందితో పాటు జేఆర్ పురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుల ఫోన్‌ల ద్వారా వీరు మందస మండలం కుడుమసాయి వాసులుగా గుర్తించారు. హర్యానికి కొన్నాళ్ల కిందటే అదే గ్రామానికి చెందిన వెంకటేష్‌తో వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న పాప కూడా ఉంది. వెంకటేష్.. రాజమండ్రిలో కుక్‌గా పనిచేస్తున్నాడు. జీవన్ సైతం కుక్‌గా తునిలో కొనసాగుతున్నాడు. వీరు సమీప బంధువులు. వెంకటేష్‌కు జీవన్ సోదరుడు వరుస అవుతాడు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో వ్యవసాయ పనుల నిమిత్తం గ్రామానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు మృతుల కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జేఆర్ పురం పోలీసులు తెలిపారు.

అధికారం అడ్డుపెట్టుకుని..!

- ఉపాధిహామీ పథకం పనుల్లో అవకతవకలు
- వైసీపీ హయాంలో అక్రమాలకు పాల్పడ్డారని..
- బూరగాం ఫీల్డ్ అసిస్టెంట్‌పై గ్రామస్థుల ఫిర్యాదు
- విచారణ చేపట్టిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు

టెక్కలి, జూలై 30: 'అధికారం మాది. మేము చెప్పిందే వేదం. ఎక్కువ మాట్లాడితే ప్రభుత్వ పథకాలు నిలిపేస్తాం. మీరు టీడీపీ వారు కదా.. మీకు ఉపాధిహామీ పనులు లేవు. ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండి'

- ఇదీ వైసీపీ పాలన సమయంలో.. టెక్కలి మండలం బూరగాం ఎంపీటీసీ జనపాన జయలక్ష్మి భర్త, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్ తిరుమలరెడ్డి హుకుం.

ఆయన అక్రమాలపై గతంలో గ్రామస్థులు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఆయన అక్రమాల డొంక కదులుతోంది. వివరాల్లోకి వెళితే..

బూరగాం ఫీల్డ్‌అసిస్టెంట్ తిరుమలరెడ్డి అక్రమాలపై ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. వైసీపీ పాలనలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఫీల్డ్‌అసిస్టెంట్ తిరుమలరెడ్డి.. ఉపాధిహామీ పథకం పనుల్లో అక్రమాలకు పాల్పడ్డారని గ్రామస్థులు మూడేళ్ల కిందట కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భార్య ఎంపీటీసీ కావడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారని.. ఆయన అక్రమాలను అడ్డుకోవాలని కోరారు. అయినా స్పందన కరువైంది. తాజాగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. గ్రామస్థులు గేదెల శ్రీనివాసరెడ్డి, జనపాన రమేష్‌తో పాటు మరో 12మంది ఇటీవల డ్వామా అధికారులకు మరోసారి ఫీల్డ్‌అసిస్టెంట్ తిరుమలరెడ్డి అక్రమాలపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ ఎం.శైలజ, ఏపీవో బగాది ప్రసాద్, జేఈ సురేష్, సాంకేతిక సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి బాబూరావు గ్రామస్థుల సమక్షంలో తిరుమలరెడ్డి వ్యవహారంపై బహిరంగ విచారణ చేశారు. దీంతో గ్రామస్థులు ఒక్కొక్కరూ.. తిరుమలరెడ్డి తీరుపై తమ గోడును వెళ్లగక్కారు. 'ఉపాధిహామీ పనులకు రానివారికి కొందరికి మస్తర్లు వేసి.. వారి నుంచి వసూళ్ల పర్వం చేపట్టారు. కొందరు వేతనదారుల నుంచి సంబంధిత మేట్ల ద్వారా వసూళ్లు చేశారు. వేతనదారులు ఒకరైతే వేరొకరు పనుల్లో పాల్గొనేలా చేశారు. టీడీపీ సానుభూతిపరులైన వేతనదారులకు ఉపాధి పనులు కల్పించకుండా అడ్డుకున్నారు. ఆయన చెప్పినట్టు చేయకపోతే.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపేస్తామని బెదిరించేవారు' అని గ్రామస్థులు తెలిపారు. వైసీపీ పాలనలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని రూ.లక్షల్లో దోచేశారని వెల్లడించారు. ఈ వివరాలన్నీ గ్రామస్థుల నుంచి రాతపూర్వకంగా అధికారులు.. సేకరించారు. ఈ మేరకు ఫీల్డ్ అసిస్టెంట్ తిరుమలరెడ్డి అక్రమాలపై చేపట్టిన విచారణ నివేదికను ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీకీ అందజేస్తామని ఏపీడీ ఎం.శైలజ తెలిపారు.



అక్రమాలపై విచారణతోపాటు గ్రామస్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

హే.. నరసింహా!

- దేవదాయశాఖ భూముల ఆక్రమణ
- తొలగించని నాటి పునాదులు
- తాజాగా షెడ్ నిర్మాణం
- అధికారుల అలసత్వంపై విమర్శలు



లక్ష్మీనరసింహ ఆలయ భూమిలో తాత్కాలిక షెడ్ నిర్మాణం



గతంలో నిర్మించిన పునాదులు

(పలాస రూరల్)

ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే చాలు.. అక్రమార్కులు ఆక్రమించేస్తున్నారు. కొండలు, గుట్టలు, చెరువులతోపాటు దేవదాయశాఖ భూములు సైతం కబ్జా చేస్తున్నారు. చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ.. దేవుడికే శఠగోపం పెడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. టెక్కలిపట్నంలోని లక్ష్మీనరసింహ ఆలయ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఈ ఆలయానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. దశాబ్దాల కిందట నిర్మించిన ఈ ఆలయాన్ని 1987లో దేవదాయశాఖ పరిధిలోకి తీసుకువచ్చారు. టెక్కలిపట్నం, గోపివల్లభాపురం గ్రామాల్లో ఈ ఆలయానికి సంబంధించిన 32 ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం వాటి విలువ రూ.కోట్లలో పలుకుతోంది. దీంతో ఆ భూములపై అక్రమార్కుల కన్నుపడడంతో అన్యాక్రాంతమవుతోంది. ఇందులో గోపివల్లభాపురంలో ఆరున్నర ఎకరాలను.. ఆర్అర్ పథకం కింద ఆఫ్‌షోర్ బాధితులకు అందించారు. మిగతా భూముల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆలయ ధూపదీప నైవేద్యాలకు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం గోపివల్లభాపురంలోని 15-6 సర్వే నెంబరులో ఉన్న 2.14ఎకరాల స్థలంపై అక్రమార్కుల కన్నుపడింది. ఇటీవల కొంతమంది రాళ్లు పాతి కొంత స్థలాన్ని ఆక్రమించారు. మరికొంతమంది తాత్కాలిక షెడ్ నిర్మించారు. ఈ ఆక్రమణ వ్యవహారం దేవదాయశాఖ, రెవెన్యూ శాఖ అధికారులకు తెలిసిన పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

గతంలో ఇదే మాదిరి...

2020 సంవత్సరంలో ఇదే మాదిరిగా ఈ భూములకు ఆనుకుని కొంతమంది పునాదులు నిర్మించారు. ఈ ఆక్రమణపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించగా.. నిర్మాణాలు నిలిపేశారు. గతేడాది డిసెంబరు 23న టెక్కలిపట్నంలో అక్రమ నిర్మాణాలను దేవదాయశాఖాధికారులు పరిశీలించి చర్యలు చేపట్టారు. పునాదులను మాత్రం తొలగించలేదు. తాజాగా.. మళ్లీ ఆక్రమణలు కొనసాగడం చర్చనీయాంశమవుతోంది. ఇప్పటికే అరకొర నిధులతో ఆలయ నిర్వహణ నెట్టుకొస్తున్నారు. ఈ భూములు సైతం ఆక్రమణకు గురైతే ఆలయ నిర్వహణ కష్టమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి లక్ష్మీనరసింహ ఆలయ భూములను పరిరక్షించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- ఈ విషయంపై వీఆర్వో సోమేశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. గతంలో దేవదాయశాఖాధికారుల దృష్టికి ఆక్రమణల విషయం తీసుకెళ్లి పరిశీలించామని తెలిపారు. అలాగే దేవదాయ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబును వివరణ కోరగా.. భూముల ఆక్రమణను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

'క్యాట్'కు వేళాయె!



మేనేజ్‌మెంట్ కోర్సు చదవాలి అనుకునే ప్రతి ఒక్కరూ పేరొందిన కాలేజీల్లో చదవాలనుకుంటారు. అలాంటి మేనేజ్‌మెంట్ కోర్సుల అడ్మిషన్ల తొలి అంచెకు ఉద్దేశించిన కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్) నోటిఫికేషన్ వెలువడింది. ఇందులో మంచి పర్సంటైల్ సాధించిన అభ్యర్థులు ఆయా అడ్మిషన్లలో ముందు వరుసలో ఉంటారు.

కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)-2024 నోటిఫికేషన్ వెలువడింది. క్యాట్ స్కోరు ఆధారంగా ఐఐఎంలే కాకుండా ప్రముఖ కళాశాలలు కూడా సీట్లను భర్తీ చేస్తాయి. దేశ వ్యాప్తంగా 170 నగరాల్లో నవంబరు 24న పరీక్షను నిర్వహించనున్నారు.

ఐఐఎంలు: అహ్మదాబాద్, ముంబయి, అమృత్‌సర్, బెంగళూరు, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, సిర్మౌర్, తిరుచిరాపల్లి, ఉదయపూర్, విశాఖపట్నం

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు చాలు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తారు. గతంలో నిర్వహించిన క్యాట్ పరీక్షల ప్రకారం.... మొత్తం 198 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది. పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. సెక్షన్-1 వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్, సెక్షన్-2 డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, సెక్షన్-3 క్వాంటిటేటివ్ విభాగాల నుంచి మొత్తం 66 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు 3 మార్కులు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆయా సంస్థలు గ్రూప్ డిస్కషన్స్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తాయి.

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.1250 చెల్లించాలి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తేదీలు:** ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 13 వరకు
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేదీలు:** నవంబరు 5 నుంచి
- **పరీక్ష తేదీ:** నవంబరు 24
- **ఫలితాల ప్రకటన:** జనవరి 2025
- **వెబ్‌సైట్:** https://iimcat.ac.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/rdmwKnPలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఎన్ఐఈపీఐడీలో డిప్లొమా

సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ)- 'డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటేషన్(డీఐఎస్ఎల్ఐ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి 1200 గంటలు చొప్పున మొత్తం 2400 గంటల బోధన ఉంటుంది. ఇండియన్ సైన్ లాంగ్వేజ్, ఇంగ్లీష్/హిందీ మాధ్యమాల్లో తరగతులు నిర్వహిస్తారు. ప్రాంతీయ భాషల్లో కూడా వివరణ ఇస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ఈ కోర్సులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు నెలకు రూ.2,000ల స్టయిపెండ్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లీష్/హిందీ భాషలో ప్రావీణ్యం తప్పనిసరి. సాధారణ స్థాయిలో వినికిడి సామర్థ్యం ఉండాలి.

ఉద్యోగావకాశాలు: ఈ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు ప్రభుత్వ/ప్రైవేట్ సంస్థల్లో సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటర్స్‌గా చేరవచ్చు. మూగ-చెవిటి పిల్లలకు, సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటర్స్‌కు ఇన్‌స్ట్రక్టర్లుగా అవకాశాలు ఉంటాయి.

- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 20
- **వెబ్‌సైట్:** www.niepid.nic.in

SCHOLARSHIP ALERT

Mohan T Advani Centennial Scholarship

Description: Blue Star Foundation aims at supporting and empowering underprivileged undergraduate and diploma students enrolled in Architecture and Engineering programmes at select private or government colleges across India through their flagship initiative, i.e. Mohan T Advani Centennial Scholarship Programme.

Eligibility: First and second-year students enrolled in a degree programme in architecture and engineering, such as Electronics Engineering, Mechanical Engineering, Information Technology (IT), Computer Science (CS), and related STEM fields, excluding Civil Engineering. Applicants must have scored a minimum of 80% in Class 10 and Class 12 for first-year students, and at least 80% in Class 12 and 75% in the 1st year for second-year students. Students enrolled in specified colleges* will be eligible to apply. Applicants' annual family income from all sources must be less than INR 6 lakh. Recipients should not be beneficiaries of any other scholarship.

Prizes & Rewards: For engineering and architecture students: INR 75,000 or 50% of the annual fees (whichever is less)

For Diploma Students: INR 30,000 or 75% of the annual fees (whichever is less)

Last Date to Apply: 20-08-2024

Short Url: www.b4s.in/aj/BSFS2

HOPE Engineering Scholarship

Description: Schaeffler India invites applications from first-year engineering female students (preference will be given to students with physical disabilities) to provide them with financial support for their engineering studies.

Eligibility: The scholarship is open to female students and preference will be given to students with physical disabilities. The applicants must have scored more than 60% marks in Class 12 (science) in the academic year 2023-24. They must be enrolled in the first year of an engineering program at any recognized college in India. The annual family income of the applicants should be less than INR 5 lakh.

Prizes & Rewards: Scholarship of INR 50,000

Last Date to Apply: 15-08-2024

Short Url: www.b4s.in/aj/SIHE15

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

మమ్మల్ని సంప్రదించకుండానే చర్యలు తీసుకుంటారా?

నిర్మాతల మండలిపై నడిగర్ సంఘం ఆగ్రహం



వివిధ అంశాలపై తమిళ నిర్మాతల మండలి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుందంటూ 'నడిగర్ సంఘం' ఆగ్రహం వ్యక్తం చేసింది. తమను సంప్రదించకుండా చర్యలు ఎలా తీసుకుంటారని నిలదీసింది. తమిళ నిర్మాతల మండలి సోమవారం సమావేశమై పలు తీర్మానాలు ఆమోదించిన విషయం తెలిసిందే. నటీనటులు, సాంకేతిక నిపుణుల పారితోషికాలు క్రమబద్ధీకరించాలని, ఆగస్టు 16 తర్వాత కొత్త సినిమాల షూటింగ్ చేపట్టకూడదని, నవంబరు ఒకటి నుంచి సినిమా షూటింగ్‌లు నిలిపివేయాలని.. ఇలా ఆరు తీర్మానాలు ఆమోదించింది. ఇలా ఏకపక్షంగా తమిళ నిర్మాత మండలి నిర్ణయాలను తీసుకోవడాన్ని నడిగర్ సంఘం తీవ్రంగా ఖండించింది. . సినీ రంగంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా షూటింగులు నిలిపివేస్తామని తీర్మానం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. పారితోషికాలు సహా ఇతర సమస్యలపై నడిగర్ సంఘం సహా మిగిలిన సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదని అభిప్రాయపడింది.

> **హీరో ధనుష్‌పై తీర్మానం చేయడం సమంజసం కాదని, ఆయనపై నడిగర్ సంఘానికి ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని స్పష్టం చేసింది.**

అలాగే ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఈ వ్యవహారంపై తదుపరి చేపట్టాల్సిన చర్యలపై తమ సంఘం కార్యనిర్వాహకుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని నడిగర్ సంఘం ప్రకటించింది.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

పురస్కారాలకు పరిష్కారం దొరికేనా?

అసంతృప్తో, ఆగ్రహమో... 'గద్దర్ పేరుతో సినీ పురస్కారాలు ఇస్తామంటే ముందుకు రారా...' అంటూ ముఖ్యమంత్రి బహిరంగ వేదికపై నుంచి అన్న ఒక్క మాట తెలుగు చలన చిత్ర పరిశ్రమను ఉలిక్కిపడేలా చేసింది. చిత్ర పరిశ్రమలోని సంఘాలు ఆయన ఆహ్వానాన్ని పక్కనపెట్టే ధైర్యం చేశాయా? ఏమీ తెలియనట్లే ఉంటూ తలెగరేసే సాహసం సినీ పెద్దలు చేయగలరా? ముఖ్యమంత్రి మాటల్లోని మర్మం ఏమిటి? అనేదే ఇప్పుడు నడుస్తున్న చర్చ.



సినిమావాళ్లు ప్రభుత్వాలకు చేసుకునే వినతులలో భాగంగానే ఇన్నాళ్లూ నంది పురస్కారాల అంశం వార్తల్లో నిలుస్తూ వస్తోంది. అయితే ఇప్పుడు మాత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో వార్తల్లో నిలవడమే ఆసక్తిని కలిగిస్తోంది. నేడో రేపు ఫిల్మ్ అవార్డ్స్ గురించి నోటిఫికేషన్ వస్తుందని అందరూ ఎదురుచూస్తున్న తరుణంలో సీఎం చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరో పక్క ఈ అవార్డుల గురించి చర్చించేందుకు మేం ముఖ్యమంత్రిని కలిసేందుకు ప్రయత్నించాం, కానీ వీలు కాలేదు అనే మాట కొంతమంది సినిమా పెద్దల చెబుతున్నారు.

సినిమా పండుగలా పురస్కారాల వేడుక

నంది పురస్కారాలను చిత్ర పరిశ్రమ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుంది. ప్రతి ఏటా ఉగాది నాడు నంది పురస్కారాల ప్రదానోత్సవం ఆనవాయితీగా వస్తోంది. ఆ వేడుకను ఇండస్ట్రీ మొత్తం పండుగలా జరుపుకునేది. అయితే 2014లో తెలంగాణ ఏర్పడ్డాక అప్పటి ప్రభుత్వం నంది పురస్కారాల స్థానే 'సింహ' పేరుతో కొత్తగా పురస్కారాలను ఇవ్వనున్నట్లు ప్రకటించింది. నామినేషన్లను సైతం స్వీకరించింది. కానీ దశాబ్ద కాలంలో సినీ ప్రముఖులు ఎన్ని విన్నపాలు చేసినా అది కార్యరూపం మాత్రం దాల్చలేదు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకనో సినీ పురస్కారాలపై ఆసక్తి చూపలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నంది పురస్కారాలను ఇచ్చే సంప్రదాయాన్ని మళ్లీ కొనసాగించాలంటూ పలు వేదికలపై నుంచి చిత్ర పరిశ్రమ తరఫున సినీ సంఘాలు, కొంతమంది సినీ ప్రముఖులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొంత ఒత్తిడి తెచ్చే ప్రయత్నం కూడా చేశారు. జనవరిలో ప్రజా గాయకుడు గద్దర్ సంస్మరణ సభలో 'గద్దర్ అవార్డ్స్' పేరుతో సినీ పురస్కారాలను ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీని అమలుపై అభిప్రాయాలు, సలహాలు అందించాలని చిత్ర పరిశ్రమ పెద్దలను కోరారు. సినీ ప్రముఖులు సైతం ముఖ్యమంత్రి నిర్ణయాన్ని అభినందించి, మద్దతు తెలిపారు. తర్వాత మాత్రం ఎలాంటి కదలికా లేదు. కానీ మంగళవారం నాడు ముఖ్యమంత్రి వ్యాఖ్యలతో నంది పురస్కారాల అంశం అనూహ్యంగా తెరపైకి వచ్చింది.

గద్దర్ పేరుతో అవార్డులు ఇష్టం లేదా?

ఏకంగా ముఖ్యమంత్రే బహిరంగంగా అసంతృప్తిని వ్యక్తం చేసే దాకా పరిస్థితి వచ్చిందంటే చిత్ర పరిశ్రమలోని సంఘాలు, సినీ ప్రముఖులు ఏం చేసుంటారు అనే చర్చ జరుగుతోంది. సినిమావాళ్లు బయటపడలేదు గానీ గద్దర్ పేరుతో పురస్కారాలను స్వీకరించడం ఇష్టంలేదనే చర్చ అప్పట్లోనే బహిరంగంగా నడిచింది. ఆ కారణంతోనే సినీ ప్రముఖులు సీఎంను కలసి పురస్కారాల విషయంపై సంప్రదింపులు జరపలేదనే మాట వినిపిస్తోంది. పరిశ్రమ నుంచి ఒక కమిటీగా ఏర్పడి ముఖ్యమంత్రిని కలిసే ప్రయత్నం చేయకపోవడం అలాంటి అభిప్రాయాలకు ఊతమిచ్చింది. 'సినిమా వాళ్లే రాలేదు' అని సీఎం అంటే 'ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ దొరకలేద'నేది సినీ పెద్దలు మాట. జరిగిందేదో జరిగిపోయింది, సినీ ప్రముఖులు, ముఖ్యమంత్రి కలసి పురస్కారాల అంశాన్ని ఓ కొలిక్కితేవాలనేదే ఇప్పుడు పరిశ్రమ ఆకాంక్ష.

స్వయంగా పిలిచినా స్పందించలేదు



నంది పురస్కారాలకు మల్లే తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ఇవ్వాలనుకుంటోంది. నా అంతట నేనే అడిగినా, ఎవరూ ముందుకు రావడం లేదు. ఇది సరికాదు. పురస్కారాల విషయంలో సినీ పరిశ్రమ మౌనంగా ఉంటోంది. గద్దర్ జయంతి సందర్భంగా డిసెంబర్ 9న సినీ పురస్కారాలను ఇవ్వడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉందని గతంలో చెప్పాను. ఈ విషయాన్ని మరోసారి తెలుగు పరిశ్రమకు గుర్తు చేస్తున్నాను. మీ విజ్ఞప్తి కంటే ముందే ఒక అడుగు ముందుకేసి ప్రకటన చేశాను. ప్రతిపాదనతో రావాలని పరిశ్రమ వర్గాలను కోరాను. కారణాలేమిటో తెలియదు కానీ సినీ ప్రముఖులు ఇప్పటివరకూ ప్రభుత్వాన్ని సంప్రదించలేదు. తెలుగు చిత్ర పరిశ్రమ కృషి, విజయాలకు గౌరవంగా గద్దర్ అవార్డులను ప్రకటించాం. సినీ పరిశ్రమ పెద్దల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరం. ఇప్పటికైనా పరిశ్రమ పెద్దలు ముందుకు వస్తే అందరం కలసి ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తాం.

- ఏ. రేవంత్‌రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి

ఆ బాధ్యత ఫిలిం ఛాంబర్ తీసుకోవాలి



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు చొరవ తీసుకొని సినిమా అవార్డులను పునరుద్ధరించే నిర్ణయం తీసుకోవడం సంతోషకరం. ప్రజా కళాకారుడు గద్దర్ గారి పేరు మీదుగా, ప్రతి ఏటా 'గద్దర్ అవార్డ్స్' తెలంగాణ ప్రభుత్వం తరఫున ఇస్తామని వారు ప్రకటించారు. తెలుగు పరిశ్రమ తరఫున, ఫిలిం ఛాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలి.

- చిరంజీవి

గద్దర్ అవార్డ్స్‌పై అభ్యంతరం లేదు



మేం ముఖ్యమంత్రిని కలిసేందుకు పలుమార్లు ప్రయత్నించాం. కానీ సీఎంఓ నుంచి మాకు పిలుపు రాలేదు. అందువల్లే ముఖ్యమంత్రిని కలవలేకపోయాం. గద్దర్ పేరుతో అవార్డ్స్ తీసుకోవడానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. సీఎం ఎప్పుడు పిలిచినా వెళ్లి కలుస్తాం.

- నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ

సీఎంను కలిసిన సినీ నటుడు అర్జున్



సీఎం రేవంత్‌రెడ్డిని సినీ నటుడు అర్జున్ మంగళవారంనాడు ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కాగా.. సంత్ శ్రీరామ్‌రావ్ జయంతి సందర్భంగా బుధవారంనాడు నిర్వహిస్తున్న మహా హోమంకు రావాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ కోరారు. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్లో కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు.

రాణీగా గర్వపడుతున్నాను




విభిన్నమైన పాత్రలతో కథానాయికగా తనదైన పంథాలో కొనసాగుతున్నారు తాప్సీ. 'ఫిర్ ఆయా హసీన్ దిల్‌రుబా' చిత్రంతో ఆమె ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. గతంలో వచ్చిన 'హసీన్ దిల్‌రుబా' చిత్రానికి ఇది కొనసాగింపు. అందులో ఆమె రాణి అనే గృహిణి పాత్రలో కనిపించారు. ఇప్పుడు రెండో భాగంలోనూ అదే పాత్రలో కనిపించనున్నారు. 'ప్రతి నాయక ఛాయలున్న పాత్ర కావడం వల్ల కొంతమందికి నచ్చలేదు. నాకు బాగా నచ్చింది. ఇలాంటి పాత్రను పోషించినందుకు గర్వపడుతున్నాను' అని తాప్సీ పేర్కొన్నారు. ఆగస్టు 9న ఈ చిత్రం ఓటీటీలో విడుదలవుతోంది.

ప్రొడ్యూసర్ టాక్

ప్రతి శుక్రవారం కొన్ని సినిమాలను విడుదల చేయడం తెలుగు చిత్రపరిశ్రమలో ఒక ఆనవాయితీ. ఆ ఒక్క రోజుతోనే చాలా మంది సినిమావాళ్ల జాతకాలు మారిపోతుంటాయి. అందుకే శుక్రవారం కోసం చిత్ర ప్రముఖులతో పాటు ప్రేక్షకులూ ఆశగా ఎదురుచూస్తుంటారు. ఈ శుక్రవారం కూడా అశ్విన్‌బాబు హీరోగా నటించిన 'శివం భజే' చిత్రం గురువారం, రాజ్ తరుణ్ హీరో పాత్ర పోషించిన 'తిరగబడరా సామీ' సినిమా శుక్రవారం విడుదలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా చిత్రాల నిర్మాతలు మల్కాపురం శివకుమార్, మహేశ్వరరెడ్డి మూలి మీడియాతో ముచ్చటించారు.

'తిరగబడరా సామీ'లో కంటెంట్ బాగుంటుంది



భార్యాభర్తలు మూడు ముళ్ల బంధానికి ఎలా కట్టుబడి ఉండాలో సినిమాలో చూపించామనీ, కంటెంట్ బాగుంటుందనీ నిర్మాత మల్కాపురం శివకుమార్ చెప్పారు.

- సైలెంట్‌గా ఉన్న వ్యక్తిని వైలెంట్‌గా మార్చేవి పరిస్థితులే. ఈ కథలో అలాంటి పరిస్థితులే ఉంటాయి. ఒక సాధారణ యువకుడు పరిస్థితుల ప్రాబల్యంతో ఎలా మారాడన్నది ఆసక్తికరంగా ఉంటుంది. రాజ్ తరుణ్ అద్భుతంగా నటించాడు.
- ప్రతి సినిమాతో కొత్త వారిని పరిచయం చేయాలన్నది నా ఉద్దేశం. గత సినిమాల్లో లాగానే ఈ చిత్రంతో మాల్వీ మల్హోత్రా హీరోయిన్‌గా పరిచయమవుతోంది.

> **సినిమా అంటే ప్రేమతో చిత్రపరిశ్రమలోకి వచ్చాను. కానీ ఇక్కడ సంపాదించింది ఏమీ లేదు. కాకపోతే మనం బతుకుతూ పదిమందిని బతికించే ఏకైక పరిశ్రమ ఇది. సినిమా సక్సెస్ అయితే దాని మీద ఆధారపడిన ఎన్నో జీవితాలు బాగుంటాయి.**

- మన్నారా చోప్రా ఇందులో నెగెటివ్ ఫీమేల్ లీడ్ చేసింది. ఆ పాత్రకు ఆమె యాప్ట్. సినిమా అంతా ఉంటుంది.
- ఈ సినిమా షూటింగ్ దాదాపుగా జహీరాబాద్‌లో చేశాం. అది మా నేటివ్ ప్లేస్. చాలా సరదాగా వర్క్ జరిగింది.
- దర్శకుడు రవికుమార్ చౌదరి చాలా హార్డ్ వర్క్ చేశారు. చెప్పినదానికంటే అద్భుతంగా తీశారు. వెరీగుడ్ డైరెక్టర్.
- జేడీ చక్రవర్తి, నరేశ్ అగస్త్య , సీరత్‌కపూర్‌తో ఓ సినిమా జరుగుతోంది. శ్రవణ్ అనే కొత్త దర్శకుడిని పరిచయం చేస్తున్నా. అలాగే రాహు కేతు అనే వెబ్ సిరీస్ కూడా చేస్తున్నాం.

ట్రైలర్ చూసి వెంకటేశ్ మెచ్చుకున్నారు



హీరో అశ్విన్‌బాబు, తన పుట్టినరోజు ఆగస్టు ఒకటిన కావడం వల్ల అదే రోజు సినిమా విడుదల చేయడం లేదనీ, అన్ని రకాలుగా అనుకూలంగా ఉండడం వల్ల ఆ రోజు విడుదల చేస్తున్నామనీ మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. ఆయన చెప్పిన వివరాలు ఇవి.

- ముందుముందు పెద్ద సినిమాలు రాబోతున్నాయి. అందుకే ఈ వారం విడుదల చేయడమే కరెక్ట్ అని నిర్మాతగానే కాకుండా డిస్ట్రిబ్యూటర్‌గా కూడా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాను.

> **కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. ఐదారు జానర్లు కలిపినట్టు ఉంటుంది. అందరినీ ఆకట్టుకొనే అంశాలు చాలా ఉన్నాయి. క్వాలిటీ, కంటెంట్ కోసం అనుకున్న దానికంటే ఎక్కువే ఖర్చు పెట్టాను.**

- విక్టరీ వెంకటేశ్ మా ట్రైలర్ చూసి మెచ్చుకున్నారు. ఆయనకి, అశ్విన్‌కు క్రికెట్ పరంగా మంచి రిలేషన్ ఉంది. ట్రైలర్ చూసి బాగుందని ఆయన మెచ్చుకున్నారు.
- ఈ సినిమాకు సంగీత దర్శకుడు వికాసే హీరో. 'హిడింబ' చిత్రం చూసి ఆయన్ని తీసుకున్నాం. మంచి పాటలు, అద్భుతమైన ఆర్ఆర్ ఇచ్చారు.
- 'శివం భజే' హిట్ అయితే తమిళంలో రీమేక్ చేస్తాం. ఐవీ కృష్ణమూర్తి టీమ్‌తో ఓ సినిమా ప్లాన్ చేస్తున్నా. కార్తికేయతో కూడా చిత్రం చేయాలనుకుంటున్నాం.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే బగ్గు

జలుమూరు (సారవకోట): మహిళలు అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గిరిజన మహిళా సంఘాలకు కొండ చీపుర్లు తయారీ యంత్రాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్ననాడే దేశం బాగుపడుతుందని, ఇదే లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మండలంలో 10 గిరిజన మహిళా సంఘాలకు కొండచీపుర్లు తయారుచేసే యంత్రాలు అందించినట్లు ఆయన తెలిపారు. వీటిని గిరిజన మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, ఎంపీడీవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట/పోలాకి: రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. మంగళవారం కత్తిరివానిపేట గ్రామంలో తన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందులను ఆర్బీకేల్లో రైతులకు అందుబాటులో ఉంచాలని జేడీ శ్రీధర్‌కు సూచించారు. రైతులకు అవసరమైన సూచనలను అందించాలన్నారు. కార్యక్రమంలో ఏడీ రవీంద్ర భారతి, ఏవోలు వెంకట్రావు, సునీత, చిరంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

మురికిపాలిటీగా చేసిన పాపం వైసీపీదే..

- అప్పటి మంత్రిని ఒక్కసారైనా ప్రశ్నించారా?
- మునిసిపల్ సమావేశంలో ఎమ్మెల్యే శిరీష ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, జూలై 30: మునిసిపాలిటీని మురికిపాలిటీగా చేసిన పాపం వైసీపీ నాయకులదేనని, ఈ విషయంలో అప్పటి మంత్రి అప్పలరాజును ఒక్కసారైనా ప్రశ్నించారా అని ఎమ్మెల్యే గౌతు శిరీష ఆగ్రహం వ్యక్తంచేశారు. మునిసిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ కౌన్సిలర్లు గుజ్జు జోగారావురెడ్డి, పప్పల ప్రసాదరావు, సనపల సింహాచలం మాట్లాడుతూ.. పట్టణంలో కాలువల పరిస్థితి అధ్వానంగా ఉందని, పూడికలు పేరుకు పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత రెండున్నరేళ్లుగా ఎటువంటి అభివృద్ధి జరగ లేదని, ప్రభుత్వం నిధులు కాలువల అభివృద్ధికి ఖర్చు చేయాలని కోరారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ.. మునిసిపాలిటీ వైసీపీ పాలనలో ఉందని, పట్టణ అభివృద్ధికి ఎందుకు నిధులు తెప్పించ లేకపోయారని అప్పటి మంత్రిని ఎందుకు ప్రశ్నించలేదన్నారు. నిధులు ఇప్పిస్తానన్న ధ్యాస ఆయనకు లేదని దుయ్యబట్టారు. ప్రస్తుత ప్రభుత్వం కాలువల్లోని చెత్తను తీసేందుకు రూ.43 లక్షలు విడుదల చేసిందని, ఈ నిధులతో పాటు మున్సిపల్ ప్రత్యేక నిధులు వినియోగించి పనులు చేయించాలన్నారు. మున్సిపాలిటీ ప్రజలు కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలిపారని, వారి రుణం తీర్చుకుంటామన్నారు. మున్సిపాలిటీకి ఎంపీ నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామని, గతంలో ఎంపీ నిధులు ఇచ్చినా అడ్డుకున్న ఘనత అప్పటి మంత్రికే దక్కిందని ఎద్దేవా చేశారు. టేబుల్ అంశంగా పనుల ప్రతిపాదనలను ఎందుకు పెట్టలేదని డీఈఈ కనకరాజును నిలదీశారు. దీనిపై టీడీపీ కౌన్సిలర్లు వజ్జ బాబూరావు, దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రాధాన్యం కలిగిన పనులు పెట్టక పోవడం, ఎమ్మెల్యే మాటలకు విలువ ఇవ్వకపోవడం తగదన్నారు. దీన్ని సరిదిద్దుతామని డీఈఈ స్పష్టం చేయడంతో వివాదం సద్దుమణిగింది. పట్టణంలో ప్రధాన కాలువలకు నిధులు కేటాయించి పనులు చేపట్టాలని కోరుతూ ఆ పనుల వివరాలను బాబూరావు ప్రస్తావించగా ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని ఎమ్మెల్యే కోరారు. సభకు గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని గురిటి సూర్యనారాయణ కోరారు. సమస్యలుంటే ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. ముందుగా అధికారులకు సమాచారం ఇచ్చి సభకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ టి. నాగేంద్రకుమార్‌కు సూచించారు. పలువురు టీడీపీ సభ్యులు పట్టణంలోని సమస్యలను ప్రస్తావించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

- ఎమ్మెల్యే గోవిందరావు



పాతపట్నం: నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యంత వెనుక బడిన నియోజకవర్గంగా ఉన్న పాతపట్నంలో అత్యధిక వలసలున్నాయన్నారు. వీటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్య వైద్య, వ్యవసాయరంగాల అభివృద్ధితో పాటు ఉపాధికల్పనకు సహకరించాలని కోరారు. ● స్థానిక శ్రీనీలమణిదుర్గ ఆలయంలో ఆవేటి మారోత్సవాల సందర్భంగా మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉదయం నుంచే ముర్రాటలు పోసి మొక్కులు చెల్లించు కున్నారు. అమ్మవారిని ఎమ్మెల్యే గోవిందరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అర్చకులు శేషవస్త్రాన్ని కప్పి ఆశీర్వదించారు.

లిఫ్ట్‌లో ఇరుక్కున్న యువకుడు

- 20 నిమిషాల పాటు నరకయాతన



లిఫ్ట్‌లో ఇరుకున్న ముకుందరావు

పలాస: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాబాయిని పరామర్శించేందుకు వెళ్లి ఓ యువకుడు లిఫ్ట్ లో ఇరుక్కున ఘటన మంగళవారం పద్మనాభపురంలోని కిడ్నీ పరిశోధన కేంద్రం ఆసుపత్రిలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. కంబిరిగాం గ్రామానికి చెందిన అరుగు ముకుందరావు తన బాబాయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని పరామర్శించేందుకు వెళ్లాడు. ఆసుపత్రిలో రెండు ప్రధాన లిఫ్టలు ఉన్నాయి. అయితే ఒక లిఫ్టను సిబ్బంది మెయింటినెన్స్ నిమిత్తం నిలిపివేశారు. ఆ సమయంలో ఆ లిఫ్ట్‌లో ముకుందరావు సుమారు 20 నిమిషాల పాటు ఇరుక్కున్నాడు. అయితే ఎంత కేకలు వేసినా బయటకు వినిపించకపోవడంతో తీవ్ర ఇక్కట్లకు గురయ్యాడు. వెంటనే మొబైల్ నుంచి బంధువులకు సమాచారం ఇవ్వగా వారు ఆసుపత్రికి వచ్చి సిబ్బందికి తెలిపిన వెంటనే లిఫ్టను తెరిచారు. ఉక్కపోతకు గురై ఆయన బయటకు వచ్చి ఆందోళన వ్యక్తంచేశాడు. తన వద్ద ఫోన్ లేకపోతే పరిస్థితి ఏమిటని సిబ్బందిని ప్రశ్నించాడు. కనీసం గాలి, వెలుతురు కూడా లేదని, సెల్ ఫోన్ వెలుగు లోనే నరకయాతన అనుభవించానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ వ్యవహారంపై ఆసుపత్రి డీన్ డాక్టర్ కూన మోహన్ బాబును వివరణ కోరగా లిఫ్ట్ నిర్వహణ కారణంగా ఆపడం జరిగిందని, ఇందులో సిబ్బంది నిర్లక్ష్యం లేదని స్పష్టం చేశారు.

అంతర పంటలపై దృష్టి సారించాలి

మెళియాపుట్టి/పాతపట్నం: గిరి జనులు అంతర పంటలపై దృష్టి సారిం చడం ద్వారా అధిక లాభం పొందవచ్చని ఉద్యానవనశాఖాధికారులు దుక్క శరత్ కుమార్‌రెడ్డి, ఎన్. మంగమ్మ తెలిపారు. మంగళవారం మెళియాపుట్టి మండలం కేరా శింగి, ఇలావురం, గొట్టిపల్లి, వీర న్నపేట, పాతపట్నం మండలం శోభ పంచాయతీ శోభపంచాయతీలోని కొమ్మలగూడ కరడాసిం గిగూడ బూర్జగూడ, బెన్నాడ గూడ, రేంగూడ, లక్ష్మిగూడ, చింతగూడ, కొర్రంగూడ గ్రామాల్లోని గిరిజనులకు అల్లం విత్తనాలను పంపిణీ చేశారు. కొత్తూరు వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి 10 కిలోల వంతున అల్లం విత్తనాలను పంపిణీ చేశారు. పోడు వ్యవసాయంలో కొండ చీపుళ్లు, పైనాపిల్, అల్లం వంటి పంటలు వేసి ఆదాయం పెంపొందించు కోవాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు సంస్థ కోఆర్డినేటర్లు జగన్నాథం, నాగరాజు, సర్పంచ్ ఆదిలక్ష్మి, హార్టికల్చర్ విస్తరణాధికారి షర్మిల పాల్గొన్నారు.

పేదల కోసం పోరాడిన అమరులకు నివాళి

పలాస: భూమి, భుక్తి, విముక్తి కోసం అనేక మంది పోరాటం చేసి అమరులయ్యారని, వారిని స్మరించుకోవడం మన కర్తవ్యమని న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. సమాజం కోసం పోరాడి అమరులైన డాక్టర్ మల్లిఖార్జున్, దుమ్ము అప్పలస్వామి, ఉర్లాం మల్లేశ్వరరావు 52వ వర్ధంతి స్థానిక సూది కొండ కాలనీ సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉన్నత చదువులు చదువుకోవాలని, ఆకలి, అసమానతలు, పేదరికం లేని కొత్త సమాజం కావాలని ఎంతో మంది గిరిజనులను జాగృతం చేసిన మహనీయులని కొనియాడారు. 1970 జూలై 30న మందస మండలం రామరాయి కొండల్లో వీరు బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరులయ్యారన్నారు. వారి త్యాగాలను మరువకూడదన్నారు. కార్యక్రమంలో వంకల పాపయ్య, తాతారావు, కృష్ణారావు, సరస్వతి పాల్గొన్నారు.

49 ఏళ్ల తరువాత అ'పూర్వ' కలయిక



1974-75 పదో తరగతి విద్యార్థులు

జలుమూరు: స్థానిక ఉన్నత పాఠశాలలో 1974-75లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు మంగళవారం సమావేశమై నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఇక్కడ 10వ తరగతి చదువుకుని ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో వివిధ వృత్తుల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారంతా ఒకచోట చేరి సందడిచేశారు. నాటి జ్ఞాపకాలను ఒకరికొకరు చెప్పుకుని ఆనందం పొందారు. 49 ఏళ్ల తరువాత కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. నాటి గురువులను సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ నేతలు పేడాడ లక్ష్మణరావు, గొలివి సింహాచలం, మాధవదాసు, మల్లారెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రేరణ పెంపొందించేందుకు ప్రోత్సాహకాలు

నందిగాం: విద్యార్థుల్లో ప్రేరణ పెంపొందించేందుకు ప్రోత్సాహకాలు దోహదపడతాయని ఉప విద్యాశాఖాధికారి పి.విలియమ్స్ అన్నారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏపీ టీఎఫ్ (2577) ఆధ్వర్యంలో మంగళవారం నందిగాం ఉన్నత పాఠశాలలో ప్రోత్సాహకాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతతో ఏపీటీఎఫ్ పనిచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో జి.నర్సింహులు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ అనిల్‌కుమార్, మండలశాఖ అధ్యక్షుడు ఎం.మల్లేశ్వరరావు, ప్రధానకార్యదర్శి బల్ల శ్రీను, హెచ్‌ఎం బి.రాము, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

పలాసరూరల్: కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని 2003 డీఎస్సీ బ్యాచ్ ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు

- డ్వామా పీడీ చిట్టిరాజు



ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

ఎల్.ఎన్.పేట: క్షేత్రస్థాయిలో చేపడుతున్న ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులకు రాకుండా మస్టర్లు వేసి పేమెంట్ చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మెటీరియల్ పనుల్లో అక్రమాలు జరిగినట్లు సోషల్ ఆడిట్‌లో నిర్ధారణ జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, ఆ మొత్తాన్ని రికవరీ చేస్తామన్నారు. మండలంలోని 22 పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో రూ.13.37 కోట్లతో 455 పనులు చేయడం జరిగిందన్నారు. పంచాయతీల వారీగా జరిగిన పనులు, అక్రమాలు, తప్పుడు మస్టర్లు వేయడం వంటి వివరాలను డీఆర్పీలు చదివి వినిపించారు. కోవిలాం, చింతలబడవంజ, డొంకలబడవంజ గ్రామాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న కొందరి తల్లిదండ్రులకు పింఛన్లు అందుతున్నాయని డీఆర్పీలు ప్రకటించారు. దీంతో డీఆర్‌డీఏ ఏపీఎం సీహెచ్. రామమోహనరావు స్పందిస్తూ.. విచారణ చేపట్టి నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలతో పాటు పింఛన్ల ను నిలుపుదల చేస్తామన్నారు. కొమ్మువలస, సుమంతాపురం, శ్యామలాపురం గ్రామాల్లో ఉపాధి పనులకు సంబంధించి వేతనదారుల హాజరు పట్టికల్లో అధికంగా దిద్దుబాట్లు జరిగాయని చెరువుల పనుల్లో అదనంగా చెల్లించారని డీఆర్పీలు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి బి. లవరాజు, ఎంపీడీవో జి.గిరిబాల, ఏపీడీ పి. రాధ, ఎస్సార్పీ తిరుపతిరావు, జడ్పీటీసీ కె.త్రినాధులు తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో లాభదాయకం



ఉడుపు యంత్రంతో వరి నాట్లు వేయిస్తున్న జేడీఏ శ్రీధర్

పోలాకి: యాంత్రీకరణ ద్వారా చేసే వ్యవసాయం ఎంతో లాభదాయకమని వ్యవసాయశాఖ జేడీ కే.శ్రీధర్ అన్నారు. మంగళవారం మబగాం కత్తిరవానిపేట గ్రామాల్లో రైతులతో ఉడుపు యంత్రంతో వరి నాట్లు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉడుపు యంత్రాన్ని రైతులు సంఘంగా ఏర్పడి కొనుగోలు చేసుకుని అద్దెకు వినియోగించుకోవాలని సూచించారు. రైతులు అధిక ఎరువులు వినియోగించడంవల్ల దిగుబడి తగ్గడమే కాకుండా భూసారం కోల్పోతుందన్నారు. యూరియా అధిక మోతాదులో వినియోగిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రవీంద్రభారతి, నరసన్నపేట, పోలాకి మండలాల వ్యవసాయాధికారులు పి.చిరంజీవులు, కె.వెంకటరావు, కె.సురేష్, కె.సునీత, పి.వరాహనర్సింహులు, జోగారావు, రైతులు పాల్గొన్నారు.

నాట్లు వేసే పద్ధతిపై అవగాహన

హిరమండలం: అంబావిల్లి గ్రామంలో వరి నాట్లు వేసే పద్ధతిపై వ్యవసాయాధికారి బి.సంధ్య మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. నారు చిగురు తుంచి నాటడం వల్ల 45 రోజుల వరకు కాండం తొలిచే పురుగు ఆశించదన్నారు. అలాగే మూడు వారాల వయసున్న వరి నారును నాటితే అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. పొలంలో కాలిబాటలు కూడా తీయాలన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు, రైతు కూలీలు పాల్గొన్నారు.

'ఎత్తిపోతల' ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నారాయణ స్వామి

హిరమండలం: కిట్టాలపాడు ఎత్తిపోతల పథకానికి సంబంధించిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లోని సుమారు 650 కేజీల కాపర్, 300 లీటర్ల ఆయిల్ చోరీకి గురైంది. వీటి విలువ రూ.8 లక్షలు ఉంటుందని రైతులు చెబుతున్నారు. మెట్ట ప్రాంతంలో వరి పొలాలకు ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించేందుకు మంగళవారం ఆయకట్టు రైతులు సిద్ధమయ్యారు. పంపుహౌస్ వద్దకు ఏర్పాట్లు చేసేందుకు వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమై ఉంది. దీంతో రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే ఎస్ఐ నారాయణస్వామి ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. సరైన వర్షాలు లేక పంటల పొలాలు ఎండి పోతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి చోరీకి గురికావడంతో ఎత్తిపోతల ద్వారా నీరు వచ్చే అవకాశం లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు లజపతిరావు, లుకలాపు తిరుపతిరావు, శివాల గోవిందరావు, మన్మథరావు తదితరులు కోరుతున్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి వృద్ధాప్య పింఛన్‌పై విచారణ

వజ్రపుకొత్తూరు: 'రిటైర్డ్ ఉద్యోగికి వృద్ధాప్య పింఛన్' శీర్షికతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. వారి ఆదేశాలతో ఎంపీడీవో తిరుమలరావు, డీటీ వి.గిరిరాజు పూండి గోవిందపురం చేరుకొని విచారణ చేపట్టారు. ఉద్యోగికి సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. ఉద్యోగ విరమణ చేసినా ప్రభుత్వం నుంచి అందుతున్న పింఛన్‌పై ఆరా తీశారు. సాయంత్రం డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ కూడా గోవిందపురం సచివాలయానికి వచ్చి విచారణ తీరుపై ఆరా తీశారు. నివేదికను జిల్లా అధికారులకు అందించనున్నట్లు ఎంపీడీవో తిరుమలరావు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రోడ్డును బాగుచేశారు

వజ్రపుకొత్తూరు: బెండి కొండ వద్ద రోడ్డుకు ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి' రహ'దారుణాలు' శీర్షికతో వచ్చిన కథనానికి ఏఈ విక్రం స్పందించారు. మంగళవారం రోడ్డుపై ఏర్పడిన గోతులను కప్పారు. నిధులు మంజూరైన వెంటనే పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపడతామని, రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు.



బురదను తొలగిస్తున్న దృశ్యం

రైలు ప్రమాద క్షతగాత్రుడికి ఆర్థిక సాయం

టెక్కలి: కాశీబుగ్గలో ఇటీవల రైలు ప్రమాదానికి గురైన పెద్దసాన గ్రామానికి చెందిన చమళ్ల సూర్య నారాయణ కుటుంబానికి అక్షర ఫౌండేషన్ చైర్మన్ బొడ్డేపల్లి నేతాజీ రూ.19,600 నగదును మంగళవారం అందించారు. సూర్యనారాయణ ప్రస్తుతం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్థికంగా ఆదుకున్న నేతాజీకి వారు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు జిల్లా కేంద్ర ఆసుపత్రి సలహామండలి సమావేశం

టెక్కలి: జిల్లా కేంద్ర ఆసుపత్రి అభివృద్ధి సలహామండలి సమావేశం ఆగస్టు ఒకటిన (గురువారం) నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ బి.సూర్యారావు తెలిపారు. ఈ సమావేశానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు హాజరవుతారని, ఉదయం 10 గంటలకు జరిగే సమావేశంలో ఆసుపత్రికి సంబంధించిన పలు అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

కొత్తూరు: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి, చెట్లుగా పెరిగే వరకు కృషి చేయాలని కడుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గొర్లె తిరుమలరావు అన్నారు. నేషనల్ గ్రీన్‌కోర్ కమిటీ కార్యదర్శి తూతిక సురేష్, ఎన్‌జీసీ ప్రతినిధి, వ్యాయామోపాధ్యాయులు జన్ని చిన్నయ్య ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మంగళవారం మొక్కలను నాటారు.

పుట్టగొడుగు కూర తిని నలుగురికి అస్వస్థత

వజ్రపుకొత్తూరు: పెద్దబొడ్డపాడ పంచాయతీ శీతాపురం గ్రామంలో మంగళవారం పుట్టగొడుగు కూర తిని నలుగురు అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఇటీవల కురిసిన వర్షాలకు పరిసర కొబ్బరి తోటలో పుట్టగొడుగులు పుట్టుకొచ్చాయి. దీంతో వాటిని చూసి ఎంతో ఆనందంతో కొట్ని భాస్కరరావు పుట్టగొడుగులను సేకరించి ఇంటికి తీసుకువచ్చాడు. సాయంత్రం వీటిని వండుకొని తిన్న తరువాత ఆ కుటుంబానికి చెందిన నలుగురు అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని స్థానికులు 108 వాహనంలో పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

దుకాణాల షెడ్ల తొలగింపు

నరసన్నపేట: పట్టణంలో వివిధ అక్రమ కట్టడాలున్నా పట్టించుకోని పంచాయతీ అధికారులు చిరు వ్యాపారులపై తమ ప్రతాపం చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మంగళవారం కళాశాల రోడ్డులో కూరగాయాల దుకాణాలు రోడ్డుపైకి వచ్చాయంటూ తొలగించారు. అలాగే శాంతామణి గుడి వద్ద యాత్ర కోసం వేసిన తాత్కాలిక షాపులను బలవంతంగా తొలగించారు.

కేంద్ర బడ్జెట్‌లో తీరని అన్యాయం

కాశీబుగ్గ: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని వామపక్షాల సంఘ నాయకులు అన్నారు. ఈ మేరకు కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.గణపతి, సీహెచ్ వేణుగోపాల్, వంకల మాధవరావు, దున్న శ్రీనివాస్ టి.అజయ్ కుమార్, బి.వాసుదేవరావు, వి.పాపయ్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

మందస: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, జీవో 117ను రద్దుచేసి ప్రాథమిక విద్యను కాపాడాలని యూటీఎఫ్ నేతలు అన్నారు. మంగళవారం ఎంఈవోలకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు ఆర్.పరమేశ్వరరావు, దుర్గాప్రసాద్ పాణిగ్రాహి, జగదీష్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని ఆదాయం రూ.3.90 లక్షలు

జలుమూరు: శ్రీముఖలింగేశ్వరాలయం హుండీ ఆదాయం రూ.3,90,013 వచ్చినట్లు ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. ఆమదాలవలస గ్రూపు దేవాలయాల ఈవో టి.రవి నేతృత్వంలో మంగళవారం శ్రీముఖలింగేశ్వరస్వామి హుండీలను లెక్కించారు. 4 నెలల 18 రోజులకు ఈ ఆదాయం వచ్చిందన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లో పారిశుధ్య పనులు చేప ట్టి ఆరోగ్యకరంగా తయారుచేయాలని టెక్కలి డీఎల్‌పీవో ఐ.వెంకటరమణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శుల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్లు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో మరుగు దొడ్లు లేని ఇళ్లను గుర్తించి వాటిని నిర్మించుకునేలా అవగాహన కలిగించాలన్నారు. ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ ఐ.పద్మజ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీచ్ పూర్వ వైభవానికి కృషి

● కె.మత్స్యలేశం బీచ్‌ను పరిశీలించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్



గార: బీచ్‌ను పరిశీలిస్తున్న స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శంకర్

గార:కె.మత్స్యలేశం బీచ్‌ను పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. మంగళవారం గతంతో వంశధార నది వరదలకు కోతకు గురైన బీచ్ పరిసరాలను అధికారులతోకలిసి పరిశీలించారు.ఈసందర్భంగా బీచ్ రక్షణ గోడ నిర్మాణం, పరిరక్షణకు సంబంధించిన మ్యాప్‌లు, ఫోటోలను గ్రామ దత్తత దారుడు కెప్టెన్ జనార్దన్ వారికి చూపించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ బీచ్‌కి పూర్వ వైభవం తీసుకురావడం కోసం సీఎం చంద్రబాబు, మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకు వెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.కళ్యాణి, తహసీల్దార్ ప్రసాదరావు, సర్పంచ్ బుడ్డా లలిత పాల్గొన్నారు.

● **శ్రీకాకుళం క్రైం:** యువత మత్తుపదార్థాలకు బానిస కాకుండా కళాశాలల్లో ప్రతినెలా అవగాహన సదస్సులు నిర్వహించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. ఈమేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని శంకర్ మంగళవారం కలిశారు. అనంతరం ఎస్పీతో శంకర్ మాట్లాడుతూ ట్రాఫిక్, శాంతిభద్రతలపై దృష్టి సారించాలని, గంజాయిరహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కోరారు.

● **అరసవల్లి:** శ్రీకాకుళం-1, 2 డిపోల పరిధిలో శ్రీకాకుళం-విజయవాడ సూపర్ లగ్జరీ, శ్రీకాకుళం-విజయనగరం ఎక్స్‌ప్రెస్ బస్సులను ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం ప్రారంభించారు.కార్యక్రమంలో రెండు డిపోల సిబ్బంది, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అరసవల్లి: శ్రీకాకుళంలోని ఏడురోడ్ల జంక్షన్, పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద గల అన్నక్యాంటీన్ల పనులను ఎమ్మెల్యే శంకర్ నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, టీడీపీ నాయకుడు అంధవరపు ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు కానిస్టేబుళ్ల మృతి

జిల్లాలో వేర్వేరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈ మేరకు పోలీసులు వారి మృతికి సంతాపం తెలిపారు.

శ్రీకాకుళం రెండో పట్టణ స్టేషన్‌లో పరిధిలో..

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళం రెండోపట్టణ పోలీసుస్టేషన్‌లో సి నెంబర్‌పై విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎస్.మాధవరావు అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఆమదాలవలసలో విధులు నిర్వహిస్తున్న మాధవరావు ఈఏడాది మార్చిలో అనారోగ్యం వల్ల టూటౌన్‌కు సి నెంబర్‌పై వచ్చాడు. జలుమూరు మండలం కొత్తకోటకు చెందిన మాధవరావు దమ్మల వీధిలో నివాసముంటున్నాడు. కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో విజయవాడ చికిత్స పొందుతున్నాడు. మాధవరావుకి భార్య పిల్లలు ఉన్నారు. మాధవరావు మృతి పట్ల వారి కుటుంబానికి ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, టూటౌన్ సీఐ జి.ఉమామహేశ్వరరావులు సంతాపం తెలిపారు.

జేఆర్‌పురం స్టేషన్‌లో పరిధిలో..

రణస్థలం: జేఆర్‌పురం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎస్.సతీష్ (45)అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందాడు. వీరఘట్టాంకు చెందిన సతీష్ 2004లో విధుల్లో చేరాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు ఆయనకు నివాళులర్పించారు.

గోనిపాడు గ్రామసభలో వాగ్వాదం



గోనిపాడు సామాజిక తనిఖీ గ్రామసభలో వాగ్వాదం చేస్తున్న ఇరువర్గాలు

సరుబుజ్జిలి: మండలంలోని సింధువాడ, గోనిపాడు, యరగాంల్లో ఉపాధి సామాజిక తనిఖీ గ్రామసభలు మంగళవారం నిర్వహించారు. గ్రామసభలో వివాదాలు జరగకుండా ఇతర పోలీస్‌స్టేషన్లకు సంబంధించి ఎస్‌ఐలు, సిబ్బందితో పహరా కాశారు. గోనిపాడులో డీఆర్పీ నరేష్ సామాజిక తనిఖీ నివేదిక చదివారు. గ్రామంలోని వలంటీర్లకు జాబ్‌కార్డులు మంజూరుచేసి ఉపాధి హామీ మస్తర్లు వేసినట్లు గుర్తించామని, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న మరికొంతమంది వేతనదారులు పనులకు వెళ్లకుండా చెల్లించినట్లు గుర్తించినట్లు తెలిపారు. వేతనదారుల వద్ద జాబ్‌కార్డులు లేకుండా పనులు నిర్వహిస్తున్న సమయంలో అందుబాటులో ఉండాల్సిన రికార్డులు కూడా లేవని పేర్కొన్నారు.దీంతో ఆ సమయంలో ఇరువర్గాల వాగ్వాదం చోటుచేసుకుంది. దీనితో గార ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్, సిబ్బందితో కలిపి ఇరువర్గాలను సర్దిచెప్పారు.గోనిపాడు గ్రామసభలో ఎంపీటీసీ మెట్ట రాము, సర్పంచ్ బిర్లంగి నాగేశ్వరరావు, తెలుగు యువత నాయకులు ఎస్.రామచంద్రమూర్తి, ఎస్పాఆర్పీ పి.రామారావు, ఏపీవో పార్వతి, ఈసీ, టీఏ, ఎఫ్ఏ పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు: సీఐ



మాట్లాడుతున్న సీఐ అవతారం

శ్రీకాకుళం క్రైం: తల్లిదండ్రులు, ద్విచక్రవాహనదారులు మైనర్లకు వాహనాలిస్తే వారిపై కేసులు నమోదుచేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం హెచ్చరించారు. మంగళవారం శ్రీకాకుళంలోని ట్రాఫిక్ స్టేషన్ ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు నగరంలో త్రిబుల్ రైడింగ్, డ్రైవింగ్ చేస్తున్న మైనర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా24 వాహనాలు మైనర్లు డ్రైవింగ్‌చేయడంతో రూ.1500 చొప్పున 36 వేలు అపరాధ రుసుము విధించారు. కార్యక్రమంలో ఎస్ఐ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అలికాం-బత్తిలి రోడ్డు



అలికాం-బత్తిలి రోడ్డు గోతుల్లో నీరుచేరిన దృశ్యం

సరుబుజ్జిలి:సరుబుజ్జిలిజంక్షన్‌లో అలికాం-బత్తిలి రహదారి అధ్వానంగా మారింది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏబీ రహదారిపై గల కల్వర్టు వద్ద ఏర్పడిన గుంతలో నీరు చేరడంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. మంగళవారం ఇక్కడి గుంత వద్ద ఓ ద్విచక్ర వాహనచోదకుడు ఎదురుగా వస్తున్న అంబులెన్స్‌ను ఢీకొన్నాడు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తక్షణమే ఏబీ రోడ్డులో గుంతలను పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించండి

● సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు



కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అరసవల్లి:ప్రజావ్యతిరేకంగా ఉన్న కేంద్రబడ్జెట్‌ను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లాకార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గసభ్యుడు బి.కృష్ణమూర్తి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీకాకుళంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీపీఎంఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్‌లో విభజన హామీల అమలు ప్రస్తావన లేకుండా చేసి రాష్ట్రానికి తీవ్రఅన్యాయంచేశారని విమర్శించారు.ఇది కార్పొరేట్లకు కొమ్ము కాసే బడ్జెట్ అని, ప్రజలపై భారాలు మోపి, సామాన్యులను దోచుకుతినే బడ్జెట్ అని దుయ్యబట్టారు.పోలవరం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉంటామని చెప్పారే తప్ప వాటికి సంబంధించిన నిధుల ప్రస్తావనే లేదని విమర్శించారు.అనంతరం బడ్జెట్ ప్రతులను దహనం చేయడానికి వారు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగమణి, సింహాచలం, ప్రసాదరావు, పి.తేజేశ్వరరావు,ఈశ్వరమ్మ, లక్ష్మిమోహనరావు చంద్రరావు, అప్పారావు, సూరయ్య, గోవర్ధనరావు, ఎన్వీ రమణ, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను చెల్లింపులపై అవగాహన

ఎచ్చెర్ల: ఆదాయ పన్నుల చెల్లింపులపై అందరికీ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఆదాయ పన్నుల శాఖ అధికారి కె.రవిశంకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల సిబ్బందికి ఆదాయ పన్నుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆదాయ పన్ను ఇన్‌స్పెక్టర్ పి.రవితేజ పాల్గొన్నారు.అలాగే వెంకటేశ్వర ఇంజినీరింగ్‌లో ఆదాయ పన్నులపై అవగాహన కల్పించారు.

పాడుబడిన బావి.. చెత్తకుప్పల్లో..

●కనిమెట్టలో బహిరంగ ప్రదేశంలో మందులు



చెత్తకుప్పలో పారబోసిన మందులు

పొందూరు :మండలంలోని కనిమెట్టలో మంగళవారం బహిరంగ ప్రదేశంలో చెత్త కుప్పలు, పాడుబడిన బావిలో భారీస్థాయిలో ప్రభుత్వాసుపత్రికి అందించే మందులను గ్రామస్థులు గుర్తించారు. వేలాది రూపాయలు ప్రజాధనం వెచ్చించి కొనుగోలుచేసిన ఈ మందులు ప్రజారోగ్యంకోసం వినియోగించాల్సిఉంది. అయితే ఇలా బహిరంగ ప్రదేశంలో దర్శనమివ్వడంపై వైద్యసిబ్బంది తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.ఇవి వినియోగానికి సమయంఉన్నా పారబోయడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు.కాగా బహిరంగప్రదేశంలో మందులు పారబోయడంపై విచారణ చేసి చర్య తీసుకుంటామని కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్‌నాయుడు తెలిపారు.

అణువిద్యుత్‌కేంద్రానికి వ్యతిరేకం కాదు

●కొవ్వాడ గ్రామ మత్స్యకారులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: అణువిద్యుత్ కేంద్రానికి తాము వ్యతిరేకం కాదని, తమ సమస్యలు పరిష్కరించాలని కొవ్వాడ గ్రామానికి చెందిన పలువురు మత్స్యకారులు అభిప్రాయపడ్డారు.మంగళవారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు క్యాంపు కార్యాలయంలో మత్స్యకారులు, కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం అధికారులతో సమావేశం జరిగింది. మత్స్యకారులకు ఇబ్బందిలేకుండా, వారి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎన్ఈఆర్ సూచించారు.

అమ్మవారికి మొక్కులు చెల్లించిన ఎమ్మెల్యే



అమ్మవారి ఘటం మోస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: పట్టణంలోని పాలపోలమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే కూన రవికుమార్ మంగళవారం మొక్కులు చెల్లించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పాలపోలమ్మ ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ప్రచారం నిర్వహించిన రవికుమార్ గెలుపొందారు. దీంతో పాలపోలమ్మకు మొక్కు చెల్లించి రవికుమార్, ఆయన సతీమణి ప్రమీల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఘటాన్ని ఎమ్మెల్యే మోశారు.

రైతులకు ఎరువుల పంపిణీ

కవిటి: బెజ్జిపుట్టుగ గ్రామ సచివాలయం పరిధిలో రైతులకు ఎరువులను మంగళవారం కూటమి నేతలు పంపిణీచేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.కృష్ణారావు, డి.దివాకర్, బి.జగన్నాథం, మనోజ్, ఎల్.రాజు, అమూల్య పాల్గొన్నారు.

● **కంచిలి:** మండలంలోని మండపల్లి పంచాయతీలో రైతులకు టీడీపీ మండల కార్యదర్శి మాదిన రామారావు రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటరావు, దామోదర్, రామారావు, గోపి, బాబూరావు, మదన్‌మోహన్, గంగరాజు పాల్గొన్నారు.

● **జి.సిగడాం:**మండలంలోని పెంటలో రాయితీపై ఎరువులను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోవిందరావు, అప్పన్న, అక్కలనాయుడు, శ్రీనివాసరావు,సంతోష్‌కుమార్, అశోక్‌కుమార్, వీఏఏలు సింహాద్రి హరికృష్ణ, హరీష్, హేమంత్ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి సహకరించండి



పీవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

కవిటి: బెలగాం అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మాణానికి సహకరించాలని గ్రామస్థులు కోరారు.ఈ మేరకు బెలగాంలో ఐసీడీఎస్ పీవో నాగరాణికి ఎంపీటీసీ సంతోష్‌పట్నాయక్, టీడీపీ మండలాధ్యక్షుడు మణిచంద్రప్రకాష్, రంగారౌలో, బాసుదేవ్ వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు ఒడిశా సాహిత్య పుస్తకాలు

కవిటి: ఆంధ్రాలోని ఒడియా విద్యార్థులకు ఒడిశా ప్రభుత్వం సాహిత్య పుస్తకాలను మంగళవారం అందించిందని ఒరియా మైనార్టీ సంఘ అధ్యక్షుడు సత్యనారాయణ పాడి తెలిపారు. ఈ మేరకు తొమ్మిది, పదో తరగతులకు చెందిన ఒడియా సాహిత్య సింధు, సాహిత్య దారా, ఒడియా వ్యాకరణానికి చెందిన 5,040 పుస్తకాలను అందజేసినట్లు పేర్కొన్నారు. కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట, మందస, మెళియాపుట్టి మండలకేంద్రాల్లో పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు తీసుకొని వెళ్లాలని వారు కోరారు.

జీవో-117 రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న పీఆర్‌టీయూ నాయకులు

సోంపేట: ఓపీఎస్ అమలుచేయాలని, జీవో-117 రద్దుచేయాలని పీఆర్‌టీయూ మండలాధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గాలిబందు, చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం సోంపేటలోని వీకే స్ట్రీట్ స్కూల్ ఆవరణలో 117 జీఓ రద్దు చేయాలని నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శరత్‌బాబు, రమేష్‌కుమార్, సాంబమూర్తి, వేణుగోపాల్, తారకేశ్వర రావు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించండి

పొందూరు:విద్యారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని పాఠశాల సిబ్బంది, గ్రామ సచివాలయ వైద్యసిబ్బందికి ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ ఆదేశించారు. మంగళవారం దళ్లవలస ఎంపీయూపీ పాఠశాలను తనిఖీచేశారు. శానిటేషన్ నిర్వహించాలని సచివాలయ కార్యదర్శిని ఆదేశించారు. వంటశాలను శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎం కిషోర్‌కు సూచించారు.

రాయితీతో ఇంటిపై సోలార్ రూఫ్ టాప్: కలెక్టర్

కలెక్టరేట్: ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా రాయితీతో ఇంటిపై సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసుకుని విద్యుత్తుచార్జీలను తగ్గించుకోవచ్చని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎన్.కృష్ణమూర్తి తెలిపారు.ఈ మేరకు కలెక్టర్‌తో కలిసి కలెక్టరేట్‌లో ప్రధానమంత్రి సూర్య ఘర్‌యోజన పథకం అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిలోవాట్ సామర్థ్యం గల రూఫ్‌టాప్ ఏర్పాటుకు ప్రభుత్వ రాయితీ రూ.30వేలు, రెండు కిలో వాట్లకు రూ.60,000, మూడు కిలోవాట్లకు రూ.78,000కు లభిస్తుందని చెప్పారు.తక్కువ స్థలంలో రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. విద్యుత్తు సిబ్బందిని కలిసి పూర్తి వివరాలను తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

లైంగిక వేధింపులకు గురిచేస్తే చర్యలు: సీఐ

ఇచ్ఛాపురం:పనిచేసేచోట మహిళలను లైంగిక వేధింపులకు గురిచేస్తే చర్యలు తప్పవని సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ పీవో నాగరాణి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పనిచేసే చోట మహిళలపై లైంగిక వేధింపులు నిరోధక చట్టం-2013పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్, ఎంఈవో కె.అప్పారావు, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, న్యాయవాది నాగరాజు పాత్రో, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

లక్ష్యంపై దృష్టి సారించాలి

ఇచ్ఛాపురం: విద్యార్థులు లక్ష్యంపై దృష్టిసారించాలని ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ సర్టిఫైడ్ ట్రైలర్ మోటివేషన్ స్పీకర్ పల్లంటి చిరంజీవి తెలిపారు. మంగళవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు శిక్షణ తరగతులు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు టైం మేనేజ్‌మెంట్ కీలకమన్నారు.

రైతులకు అవగాహన కల్పించండి

ఇచ్ఛాపురం: ఖరీఫ్ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ సహాయకుడు జగన్‌మ్మోహన్‌రావు తెలిపారు. మంగళవారం ఇచ్ఛాపురంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో వీఏఏలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో భార్గవి పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరం

గుజరాతీపేట:మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు.మంగళవారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జి.ఇందిరా ప్రసాద్, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

తెలియని వ్యక్తులతో స్నేహం చేయవద్దు: ఎస్ఐ

శ్రీకాకుళం క్రైం: తెలియని వ్యక్తులతో స్నేహం చేయవద్దని ఏహెచ్‌టీయూ విభాగ ఎస్ఐ రేవతి సూచించారు. మంగళవారం శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్‌లో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఏడు రోడ్ల కూడలి నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

అరసవల్లి: ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంస్థ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాలరావు కోరారు.ఈ మేరకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మంగళవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు గజపతి, కుమార్ నాయక్, గంగాంజనేయులు, సుధీర్ కుమార్, మహివర్మ, అశోక్, 26 జిల్లాల అధ్యక్షులు,సెక్రటరీ పాల్గొన్నారు.

వాణిజ్య పన్నులపై అవగాహన అవసరం

గుజరాతీపేట: వాణిజ్య పన్నులపై ప్రతి ఉద్యోగికి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఆదాయ వాణిజ్య పన్ను అధికారి కె.రవిశంకర్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వాణిజ్య పన్నులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్య క్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, కామర్స్ విభాగాధిపతి ఎల్.కృష్ణారావు, ఇన్‌స్పెక్టర్ పి.రవితేజ, పి.శంకరనారాయణ, సీహెచ్ కృష్ణారావు పాల్గొన్నారు.

స్వచ్ఛ శ్రీకాకుళమే లక్ష్యంగా పనిచేయాలి: కమిషనర్

శ్రీకాకుళం అర్బన్:స్వచ్ఛ శ్రీకాకుళమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పారిశుధ్య కార్మికులు, నగర పాలక సిబ్బందికి పిలుపునిచ్చారు.సోమవారం రాత్రి మహిళా కళాశాల వెనుక భాగంలో డ్రైనేజీ సమస్య ఉందని కమిషనర్‌కు సమాచారం రావడంతో మంగళవారంపారిశుధ్యపనులు చేపట్టారు.డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు ఇవ్వాలని ఇంజనీరింగ్ సిబ్బందికి కమిషనర్ ఆదేశించారు. అలాగే పలు వసతి గృహాలను కమిషనర్ ఒబులేసు పరిశీలించారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కావడి ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయంలో ఆడి కృతికా నక్షత్రం పురస్కరించుకుని మంగళవారం సుబ్రహ్మణ్య స్వామి కావడి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాలు పెరుగు, తేనే కావడిలో ఊరేగించి ప్రధాన అర్చకులు అరవెల్లి సీతారామ శర్మ అభిషేకాలు చేశారు.

●**ఇచ్ఛాపురం:**చ్ఛాపురంలోని స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో గల సుబ్రహ్మణ్య స్వామి ఉపాలయం వద్ద అర్చకులు సత్యమూర్తి పంతులు ఆధ్వర్యంలో స్వామి కళ్యాణ వేడుకలు జరిపారు. సాయంత్రం స్వామివార్లకు తిరువీధి నిర్వహించారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు: ఆర్డీవో



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రంగయ్య

ఎచ్చెర్ల: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో రంగయ్య హెచ్చరించారు. మంగళశారం ఎస్ఎంపురం గ్రామంలో గల గురుకుల పాఠశాలకు సంబంధించిన భూముల ఆక్రమణలపై ఆర్డీవో పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలస్థాయి అధికారుల పర్యవేక్షణలో పాఠశాలకు 30 ఎకరాలు భూమి హద్దులను ఏర్పాటు చేసుకుంటే ఆక్రమణలు అరికట్టవచ్చని తెలిపారు. పాఠశాల స్థలం ఆక్రమణలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి నివేదిక అందించాలని తహసీల్దార్ చక్రవర్తిని ఆదేశించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పంపిణీపై వివరాల సేకరణ



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కూర్మారావు

కంచిలి: మండలంలోని బలియాపుట్టుగ రేషన్ డిపో పరిధిలోని ప్రజాపంపిణీపై లబ్ధిదారుల నుంచి వివరాలను సీఎస్‌డీటీ కూర్మారావు మంగళవారం సేకరించారు. ఈ వ్యవస్థ ద్వారా అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకానికి సరుకుల పంపిణీపై వివరాలు సేకరించినట్లు తెలిపారు. లబ్ధిదారుల నుంచి సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

ఆరుగురు కానిస్టేబుళ్లకు పదోన్నతులు

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో వివిధ పోలీసుస్టేషన్లలో పనిచేస్తున్న ఆరుగురు కానిస్టేబుళ్లకు పదోన్నతులు కల్పిస్తూ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న యు.నారాయణమూర్తి, ఎస్.కోదండరావు, మెళియాపుట్టిలో పనిచేస్తున్న ఎల్.రామకృష్ణ, నరసన్నపేటలో పనిచేస్తున్న ఏపీ శ్రీనివాసరావు, కోటబొమ్మాళిలో పనిచేస్తున్న బి.బాలకృష్ణ, మన్యం జిల్లాలో పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావుకు హెడ్ కానిస్టేబుళ్లగా పదోన్నతులు లభించాయి.

శరవేగంగా కాలువ నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

పొందూరు : పొందూరు -వాండ్రంగి సరిహద్దులోని పాతబస్టాండు వద్ద కాలువ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పాతబస్టాండ్ కూడలి వద్ద మలుపులో రోడ్డు నిర్మించకపోవడంతో మురుగు నీటి సమస్యతో పాటురోడ్డు గోతులమయంకావడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకునేవి. దీంతో సమస్యను టీడీపీ మండలాధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, జి.సిగడాం సర్పంచ్ నాగరాజు, నాయకులు బూరాడ వెంకటరమణ ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే రవికుమార్ తక్షణమే సమస్య పరిష్కరించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించడంతో కాలువ, రోడ్డు పనులను వేగవంతం చేశారు. ఈ మేరకు మంగళవారం పనులను ఏఈ ఆంజనేయనాయక్ రామ్మోహన్, నాగరాజు, బూరాడ రమణ పరిశీలించారు.

యూడైస్ పూర్తిచేయండి: ఎంఈవో



పాఠశాల రికార్డులను తనిఖీ చేస్తున్న రాజారావు

పొందూరు: పాఠశాలలో యూడైస్ కార్యక్రమం పూర్తిచేయాలని ఎంఈవో-2 వి.రాజారావు లోలుగు కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్యకు సూచించారు. మంగళవారం ఆ పాఠశాలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ప్రతి విద్యార్థి యూడైస్‌లో నమోదు కావాలని తెలిపారు. రాష్ట్ర ఐటీసెల్ ఆదేశాలమేరకు ప్రభుత్వం ఇచ్చిన సిమ్‌ను రూటర్స్‌కు అమర్చి యాక్టివేట్ చేయాలని సూచించారు. అనంతరం పాఠశాల పరిశరాలను పరిశీలించారు.

మెనూ పాటించాలి

ఇచ్ఛాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారమే అందించాలని ఎంఈవో కె.అప్పారావు తెలిపారు. మంగళవారం బాలకృష్ణాపురం పాఠశాలలో ఎండీఎంను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణారావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

ఇచ్ఛాపురం:రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అరాచకపాలన సాగిస్తోందని ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆరోపించారు. మంగళవారం ఇచ్ఛాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి అరాచకాలు మితిమీరి పోయాయని, పట్టపగలే హత్యలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య, ఎంపీపీ బోర పుష్ప, నాయకులు ప్రకాష్‌రావు పట్నాయక్, సుగ్గు ప్రేంకుమార్, బచ్చు జగన్, ఇప్పిలి కృష్ణారావు, లాభాల శంకర్, పురుషోత్తంరెడ్డి, నూకయ్యరెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

గార : శ్రీకూర్మం జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు (1997-98) పాఠశాలకు నాలుగు టేబుళ్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రచ్చబండ నిర్మాణానికి ఆర్థికసాయం

జి.సిగడాం: మండలంలోని నిద్దాంలో రచ్చబండ నిర్మాణానికి ఎచ్చెర్ల నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి విశ్వక్‌సేన్ రూ. 30 వేలు చెక్కు మంగళవారం గ్రామస్థులకు అందజేశారు. జనసేన మండలాధ్యక్షుడు మీసాల రవికుమార్ సూచన మేరకు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కాకర్ల బాబాజి పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదుకు డ్రైవ్

ఆమదాలవలస: జనసేన సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తోందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్‌రావు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఫ్లైఓవర్ దిగువన జనసేన సభ్యత్వ నమోదు మెగా డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పథకాలు, పాలనను ప్రజల్లోకి విస్తృతంగా సుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.

నేడు మునిసిపల్ సమావేశం

ఇచ్ఛాపురం: మునిసిపల్ కార్యాలయంలో బుధవారం సమావేశం జరుగుతుందని చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్లు హాజరు కావాలని కోరారు.